# ఆహ్వానం

కష్టాలు మనుషులకు కాక మానులకు వస్తాయా అని ఎప్పటికప్పుడు తనకు తనే ధైర్యం చెప్పుకుంటూ, ఏటికి ఎదురీదుతు, మొండిగా బ్రతుకును వెళ్ళదీస్తున్న శారదమ్మకు మనుమడు ప్రకాశ్‌ను చూస్తే కడుపు తరుక్కుపోతున్నాది.

భగవంతుడి చర్యలు ఆమెకు అంతుబట్టటంలేదు. ఆనందాన్ని సుఖాన్ని ఇలా ఇచ్చి అలా ఎందుకు వెనక్కు తీసుకుంటాడు ఆ దేవుడు? తను చేసిన నేరం ఏమిటి?

బెండకాయలు తరుగుతున్న ప్రకాష్‌ను చూసిన శారదమ్మకు నవ్వు వచ్చింది. అసలే చిరాగ్గా వున్న ప్రకాష్‌కు నాయనమ్మ నవ్వుతో కోపం వచ్చింది.

"నాయనమ్మా! ఈ బెండకాయలు అడ్డంగా తరగబడటంలేదు. నిలువుగా చీల్చబడుతున్నాయి. ఇలాగే తరిగేయనా?" అన్నాడు ప్రకాశ్.

"ఒరేయ్ నానీ! బెండకాయల్ని నిలువుగాను, మామిడికాయల్ని అడ్డంగాను తరుగుతారా? అంత ముదరకాయలు తెచ్చావేం? కొసలు చిక్కి చూస్తే లేతవో ముదరవో తెలిసేవిగా?" అంది.

"నాకేం తెలుసు. లేతకాయలంది."

"బొంకుల దిబ్బ మీద కొన్నావా? నువ్వో వెఱ్ఱిబాగులవాడివి. ఎందుకూ పనికి రానివాటిని నీకు అంటగట్టింది. అవేం తినగలవు. చెత్తబుట్టలో పారేయి" అంది.

"ఆరు రూపాయలు దండగే అంటావా?" అన్నాడు ప్రకాశ్.

"అందుకే అంటారురా బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా పనికిరావని. నీకీ ఖర్మ దేనికిరా. మంచి చదువుంది. మంచి ఉద్యోగం ఉంది. నువ్వు ఊ అంటే అప్సరసలాంటి పిల్లనిచ్చి పెళ్ళి చేయనా? ఈ వంటావార్పూ నీకెందుకు?" అంది శారదమ్మ.

"నాయనమ్మా! నేను ఏ మాట ఎత్తినా నీవు నాపెళ్లి మాట ఎత్తుతావు. ఇంకోమారు ఆ మాటంటే నేను సన్యాసుల్లో కల్సిపోతాను."

"అంతే అంటావు. అంతేగాని అందరిలాగ పెళ్ళి చేసుకుని పిల్లాపాపలతో సుఖంగా ఉండాలనుకోవు."

"పెళ్లి చేసుకోకూడదని నేను నిర్ణయించుకున్నాను. ఆ మాట ఎన్నిసార్లు చెప్పాలి?"

పెళ్ళంటే అంత వైరాగ్యం దేనికి? స్త్రీ అయినా పురుషుడైనా పెళ్లి కానిదే పరిపూర్ణుడు కారు.

ముందు నీ ఆలోచనలు ఎలాగుండేవి? 'సుమిత్రను నేను ప్రేమించాను. ఆ పిల్లనే నేను పెళ్ళి చేసుకుంటాను' అని కదరా నువ్వు నాతో అనే వాడివి.

"ఔను! అది వెనకటి సంగతి."

"నేను అడ్డు చెప్పానా?"

"అని నేననలేదే. ఏం జరిగిందో నీకు తెలియదా?"

"నానీ! స్త్రీ లతలాంటిది. అది ఒకే వృక్షాన్ని ఆశ్రయిస్తుందంటారు. పురుషుల్ని లతతో పోల్చ లేదు. ఆ సుమిత్ర ప్రేమించింది. ఇద్దరు పెళ్లి చేసుకోవాలనుకున్నారు. కాని వాళ్ల నాన్న నీకంటె డబ్బు హోదా కలవాడిని చూపిస్తే నిన్ను కాదని వాడిని పెళ్ళి చేసుకుంది. ఇప్పుడు పిల్లాపాపతో సంసారజీవితం కొనసాగిస్తున్నది. కాని నువ్వు భగ్న ప్రేమికుడిలాగ అసలు పెళ్ళే చేసుకోనని భీష్మించుకు కూర్చున్నావు. ఇదేం విడ్డూరం." అంది శారదమ్మ.

"ఒకరికి మనసిచ్చి వేరొకరిని చేసుకుని వారికి న్యాయం చేయలేను. నాకీ జీవితమే సుఖంగా ఉంది. పెళ్ళి చేసుకోమని నన్ను మాటిమాటికి వేధించకు, నీకు పుణ్యం వుంటుంది" అన్నాడు ఆ బెండకాయల్ని చెత్తబుట్టలో పారవేయడానికి వెళ్తూ.

★ ★ ★

ప్రకాశ్ రోజూ ఉదయం పదిగంటలకి ఆఫీసుకు వెళ్తాడు. అప్పటికి అతను వంట వండి పెడతాడు. శారదమ్మ మనుమడు పెళ్ళి చేసుకోలేదన్న కారణంతో అలిగి వంట ఇంటిగుమ్మం తొక్కనని శపథం చేసింది.

"నాయనమ్మ! పన్నెండు కాకుండానే భోజనం చెయ్యి. వేళకు మందు వేసుకో" అని చెప్పి వెళ్ళిపోతాడు.

తనకోసం వాడు కష్టపడుతూ ఉంటే శారదమ్మకు కష్టంగానే వుండేది. అయినా వాడిని దారిలో పెట్టాలంటే కొంచెం కటువుగా ఉండాని అనుకునేది. మంచంమీద పడుకున్న ఆమె ఆలోచనలు గతంలోనికి పరుగులు తీసాయి.

వివాహజీవితం గురించి కలలు కన్నన్ని రోజులు కూడా కాపురం చేయలేదు. పెళ్ళి అయిన రెండేళ్ళకే ఆమెకు వైధవ్యం ప్రాప్తించింది. తాహతుకు మించి కట్నం యిచ్చిన తండ్రి పరిస్థితి దారుణమైంది. తల్లీదండ్రి ఆమె పెళ్ళి అయిన కొద్ది మాసాలకే మరణించారు. దాంతో పుట్టింటితో సంబంధాలు తెగిపోయాయి. అత్తమామలు అంత దుఃఖంలోను శారదను హృదయానికి చేర్చుకోలేదు. గుడ్డిలో మెల్ల అన్నట్లు శారద భర్త భార్యను అభిమానంగానే చూసేవాడు ఏడాది తిరగ్గానే శారద తల్లి అయింది. మనుమడు జన్మించినా శారద అత్తమామల మనసు మారలేదు. వారెన్ని మాటలు అంటున్నా శారద మౌనంగా భరించేది. కాని దురదృష్టం ఆమె నొసట రాసి ఉంది. శారద భర్త ఆకస్మికంగా కన్నుమూశాడు. అప్పటినుండి కష్టాలు మొదలయ్యాయి. మా కొడుకే మాకు దూరమైనపుడు నీ బాధ్యత మాకెందుకని బాలెంతరాలని కనికరించకుండా ఇంటినుండి వెడలగొట్టారు.

ఆస్తికోసం కోర్టుకెళ్ళమని కొందరు శారదకు సలహా యిచ్చారు. కోర్టులో తనకెప్పుడు న్యాయం చేకూరుతుంది? అంతవరకు ఎవరి ఆసరాతో పూటగడుపుతుంది. ఆ నలుసుని తీసుకొని ఊరు వదిలి

చిన్న బస్తీలో కాపురం పెట్టింది. ఆమె అదృష్టం బాగుండి ఒక స్కూల్లో ఉద్యోగం దొరికింది. ఆమె ఆశలన్నీ ఆ కొడుకుపైనే.

★ ★ ★

"శారదా! మీ శ్రమఫలించిది. మీరు మీ ధ్యేయాన్ని సాధించారు" సహోద్యోగులు ఆమెను మెచ్చుకున్నారు.

"ఇన్నాళ్ళ మీ కష్టాలు ఇంతటితో ముగిసాయి. మీరు అదృష్టవంతులు" అన్నారు ఇరుగు పొరుగులు. వాళ్ళు అలా అభినందిస్తూంటే శారద కళ్ళవెంట ఆనందబాష్పాలు రాలాయి.

యౌవనంలో భర్తను కోల్పోయిన స్త్రీ జీవితం ఎంత దుర్భరమో ఆమెకు తెలుసు. ఆదుకునేవాళ్లు, చేయూతనిచ్చే వాళ్లు కరవయ్యారు. బయట ప్రపంచంలో భర్తలేని స్త్రీని ఎంత చులకనగా చూస్తారో ఎంతగా వేధిస్తారో, అడుగడుగునా ఎన్ని ఉచ్చులుంటాయో ఆమె ప్రత్యక్షంగా గ్రహించింది. అనుభవించింది. ఏటికి ఎదురీదటం నేర్చుకుంది. తన జీవితాన్ని ఒక తపస్సుగా మార్చుకుంది. కంటకమయ జీవితాన్ని దేవుడు ప్రసాదించిన జ్ఞానం ఆసరా చేసుకొని ఇరవై రెండేళ్ల జీవితం గడిపింది. ఆమె ఆశయం లక్ష్యం కుమారుడ్ని వృద్ధిలోకి తేవటం.

ఆమె ఆశలు ఫలించాయి. ఆమె ధ్యేయం నెరవేరింది. ఆమె కొడుకు చదివిన చదువును సార్థకం చేసుకుని ఉద్యోగస్తుడయ్యాడు. మొదటినుండి దారిద్ర్యంలో పెరిగిన ఆమె కట్నాలు ఆశించలేదు. ఒక బీదయింటి పిల్లను కోడలుగా చేసుకుంది.

"అమ్మా! ఇంక నువ్వు కష్టపడవలసిన పనిలేదు. ఉద్యోగానికి రాజీనామా చేసి యింటి పట్టునుండు" అన్నాడు శారద కొడుకు.

కోడలు కూడా అదేమాట అంది. "మీ బాధ్యతలను కర్తవ్యాలను నిర్వర్తించారు. ఇంక మీకు ఉద్యోగం అవసరంలేదు" అంది కోడలు.

"నిజమే బాబు! నేను పడ్డ కష్టాలు నీకు తెలియనివికావు. అయితే ఒక జీవితానికి అలవాటు పడ్డాను. ఈ ఉద్యోగం ఒక గుదిబండ అన్న రోజులు వున్నాయి. నీ ఆలనా పాలనలకు సమయం ఇవ్వలేకపోతున్నానని బాధపడేదాన్ని. ఉద్యోగాన్ని వేరే కారణాల వలన వదిలేయాలని, ఈ మనుషుల నుండి దూరంగా పారిపోవాలని అనుకునేదాన్ని. ఒంటరి స్త్రీని ఎంత చులకనగా చూస్తారో దాన్ని మాటలతో చెప్పలేను. ఐతే ఆనాడు నా ముందున్నదొకటే లక్ష్యం. ఎన్ని అవాంతరాలు వచ్చినా ఎంతటి మనఃక్షోభ ననుభవించినా నిన్ను ప్రయోజకుడిని చేయాలి. ఆ లక్ష్యంతో ముందుకు సాగాను. ఇప్పుడు అది అలవాటుగా మారింది. వేళకు వెళ్ళి పిల్లలకు పాఠాలు చెప్పకపోతే నాకు తోచదు" అంది శారద.

విధిలీలలు విచిత్రంగా ఉంటాయి. రోజులన్నీ ఒక్కలాగ ఉండవు. కొడుకు కోడళ్ళతో ఆమె ఆనందంగా గడిపింది రమారమి మూడేళ్ళే.

"అమ్మా! చాలా రోజులై నీవు దైవదర్శనానికి వెళ్దాం అంటున్నావు. నాకు సెలవు దొరికింది. రేపే ప్రయాణం" అన్నాడు శారద కొడుకు.

ఏడాది నిండని పసికందుని తీసుకుని కొడుకు కోడళ్ళతో ఆమె టాక్సీలో వెళ్ళింది. దారిలో

ఏక్సిడెంట్ జరిగి కోడలు, కొడుకు, డ్రైవరు అక్కడికక్కడే మరణించారు. అయితే తనతో ఆటలాడుకోవటంలో విధికి ఏం తృప్తి మిగిలి ఉందో ఆ పసికందు బ్రతికిపోయాడు.

"భగవంతుడా! వీడినెందుకు మిగిల్చావు?" అంటూ విలపించింది.

జీవితంతో పోరాడే శక్తి తనకు లేదే? కాని వీడిని సాకాలి. తిరిగి శారద తన కర్తవ్యంలో నిమగ్నమైంది.

★ ★ ★

ఏడాది నిండని ఆ పసికందుని ఎలా సాకిందో ఆ భగవంతుడికే తెలుసు. ఇప్పుడు ఉద్యోగంలో ఒడుదుడుకుల్లేవు. వాడు ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తుంటే ఆమె అనందించేది. తల్లీదండ్రిని చిన్న వయసులోనే పోగొట్టుకున్నాడని కలతచెందేది.

ప్రకాశ్ చదువు పూర్తయ్యింది. తన కర్తవ్యాన్ని నిర్వహించాలన్న తృప్తి మిగిలింది. ఆమె ఉద్యోగవిరమణ చేసింది. సుమిత్రను నేను పెళ్లి చేసుకుంటానని ప్రకాశ్ అంటే సంతోషపడింది. ఆ వయసులోనూ ఆమెకు మనస్తాపానికి కొదవలేదు. కష్టాల పరంపర కొనసాగుతూనే ఉంది. సుమిత్ర వేరొకరిని చేసుకోవడంతో పెళ్ళీడుకొచ్చిన మనుమడు భగ్నప్రేమికుడయ్యాడు.

★ ★ ★

శారదమ్మ ఎన్నో విధాల నచ్చచెప్పింది, బ్రతిమాలింది. నువ్వు పెళ్ళి చేసుకోకపోతే నేను వంట చేయను, అసలు వంటింటి ఛాయలకే రాను అని అస్త్రసన్యాసం చేసింది. ఆనాటి నుండి వాడే వండి పెడుతున్నాడు. వాడిచేత వంట చేయించడానికి బాధగా ఉన్నా ఆమెకు మనుమడి మనసు మార్చడానికి మరో మార్గం లేకపోయింది.

★ ★ ★

శారదమ్మ ప్రతిరోజు సాయంత్రం అంజనేయస్వామి గుడికి సిటీ బస్సులో వెళ్లి వస్తుంది.

రెండు నెలలుగా ఆమెనొక దృశ్యం ఆకట్టుకుంటున్నది. తను ఎక్కే బస్సులోంచి ఓ పిల్ల రెండేళ్ళ చంటిపాపను తీసుకుని బస్సు దిగుతోంది. రంగు చీర కట్టుకున్నా చేతికి గాజులు, నొసట బొట్టు, కాళ్ళకు మట్టెలు లేవు. ఆ పిల్ల భర్తను పోగొట్టుకుందని ఆమె గ్రహించింది. ఒకనాడు తన భర్త పోయినప్పుడు తన వయసెంతో ఇప్పుడా పిల్ల వయస్సు అంతే ఉంటుంది.

ఆ పిల్లను చూడగానే ఆమె కడుపు తరుక్కుపోయింది.

బస్సు ఎక్కబోతున్న శారదమ్మ తూలిపోయి పడబోయింది. అంతలో ఆ పిల్ల శారదమ్మను పట్టుకుంది. బస్సు తనకేమీ పట్టనట్లు వెళ్లిపోయింది.

"బామ్మగారు ఏమయింది?" అంది ఆ పిల్ల.

"………."

"ఈ వయసులో తోడు లేకుండా ప్రయాణమా?"

"తోడు….. తోడు లేకుండానే నా జీవితం సాగుతోంది. ఏం చెయ్యను, ఇది నా ఖర్మ" అంది స్వగతంగానే.

"మీరు రోజూ ఈ బస్సులో ఎక్కడకు వెళ్తారు. చీకటిపడిన తరువాత వస్తారా? నయమే

సమయానికి నేనున్నాను" అంది ఆమె.

"ఏం చెయ్యను? ఇంట్లో ఎంతసేపని ఒంటరిగా కూర్చోగలను? రోజూ భగవద్దర్శనం కోసం గుడికి వెళ్ళి వస్తాను" అంది శారదమ్మ.

"ఒంటరిగా ఉంటున్నారా?"

"లేదులే, నామనుమదున్నాడు. ఉద్యోగం చేస్తున్నాడు. రాత్రి ఎనిమిదికి కాని రాదు.

"పదండి మీయింటివరకు తోడువస్తాను" అంది ఆపిల్ల.

శారదమ్మ చెయ్యి పుచ్చుకుని ఆ పిల్ల నడిపించసాగింది.

"మనుమరాలా! చాలా రోజులై నేను నిన్ను చూస్తున్నాను. నీ పేరేమిటి, ఏం చేస్తున్నావు, ఎక్కడు వుంటున్నావు."

తన పేరు ఇందుమతి అని, తను చేస్తున్న పని గురించి చెప్పింది.

"ఎలాగూ మా యింటివరకు వచ్చావు, లోపలకిరా, కాస్త కాఫీ త్రాగి వెళ్ళువుగాని" అంది శారదమ్మ.

"ఇప్పుడు కాదు, నేను తొందరగా వెళ్ళాలి" అంది ఇందుమతి.

★ ★ ★

ఇందుమతికి సంబంధించిన వివరాలను సేకరించింది శారదమ్మ. తన జీవితంలాగే ఆమె జీవితం కూడా ఆడవిగాచిన వెన్నెల అయినందుకు ఆమె దుఃఖించింది. ఈ ప్రపంచంలో ఆమె ఒంటరిగా ఎలా జీవిస్తుంది?

'ఈ వయసులో తోడు లేకుండా ప్రయాణమా?' అని తనతో అంది మరి ఆమె చేస్తున్నదేమిటి? తోడు అవసరం ఇప్పుడు తనకా? ఆమెకా?

ఆ పిల్ల వేరెవరినైనా పెళ్ళి చేసుకుంటే సమస్యకు శాశ్వత పరిష్కారమౌతుంది. తను ఆమెను ఒప్పించగలదా?

శారదమ్మ తనలో తనే నవ్వుకుంది. ఇంట గెలిచి రచ్చ గెలువమంటారు. పెళ్ళికి తన మనుమడినే ఒప్పించలేకపోయింది. పరాయి పిల్లను తాను ఒప్పించగలదా? ఒకవేళ ఆ పిల్ల అంగీకరించినా ఆమెను చేసుకుందికి ఎవరు ముందుకు వస్తారు? ఆమె ఒక పిల్లాడి తల్లి కూడానూ.

శారదమ్మ ఆలోచించలేకపోయింది. ఏదో చేయాలన్న సంకల్పం, అది నెరవేరదనే అపనమ్మకం.

రోజుల అనాసక్తంగా దొర్లిపోతున్నాయి. ఆరోజు తూలిపడిపోబోయిన తరువాత శారదమ్మ బయటకు వెళ్ళటం బాగా తగ్గించింది. నాలుగురోజులు సెలవు తీసుకుని ప్రకాశ్ ఇంటివద్దే ఉండిపోయాడు.

"నాకేం కాదులే, ఎన్నాళ్ళు ఆఫీసుకి వెళ్ళక ఇంట్లో వుంటావు?" అంటూ ప్రకాశ్‌ని డ్యూటీకి పంపించింది.

రెండు గంటలప్పుడు కాలింగ్‌బెల్ మ్రోగుతే ఎవరా వచ్చింది అని అనుకుంటూ తలుపు తీసింది.

"శారదమ్మగారి ఇల్లు ఇదేనా?"

"రండి, నేనే శారదను" అంది.

వాళ్లు ప్రకాశ్‌కు తమ పిల్లనివ్వాలని వచ్చారు. శారదమ్మ అన్ని విషయాలు చెప్పి "మీరు అనవసరంగా శ్రమ తీసుకొని వచ్చారు. మావాడు పెళ్ళి చేసుకోను అంటున్నాడు" అంది.

★ ★ ★

"నానీ! ఈరోజు నాకెంత సంతోషంగా వుందనుకున్నావు అల్పసంతోషమే అనుకో" అంది.

"నాయనమ్మా! చింతలే చితికి చేరుస్తాయి అన్న సంగతి నీకు తెలుసు. డాక్టరేమంటాడు? ఏ చీకూ చింత లేకుండా సంతోషంగా వుంటే మీ నాయనమ్మ వందేళ్ళు బ్రతుకుతుంది అని అన్నాడు. రోజూ ఇలా సంతోషంగా వుండే ప్రయత్నం చెయ్యి."

"అందుకే కదరా నీకీ విషయం చెప్పాలనుకుంటున్నాను. వధువు కావలెను అని ఒక ప్రకటన న్యూస్‌పేపర్‌లో వేయించు. ఎవరెవరో మన సంబంధంకోసం వస్తూ పోతూ ఉంటారు. ఈరోజేం జరిగింది ఒక ఆడపిల్ల తల్లిదండ్రులు ఇక్కడో పెళ్ళి కావలసిన కుర్రాడు వున్నాడని తెలుసుకుని రాయగడ నుండి వచ్చారు. రమారమి మూడుగంటలు కాలక్షేపం జరిగింది నాకు. వాళ్ళ పిల్ల అందంగా ఉంటుంది, చదువుకుంది. అయితే పెద్దగా కట్నాలు ఇచ్చుకోలేరట. ఫ్చ్.. ఏం లాభం. నువ్వో మొండివాడివి. నా మాట వినవని చెప్తే దిగాలుపడి వెళ్ళిపోయారు. పేపరులో ప్రకటన కేవలం నా సంతోషం కోసమే. ఏదో సాకుతో వాళ్ళను నేను సాగనంపుతాను" అంది శారదమ్మ.

"బాగుంది నాయనమ్మ నీ కోరిక. ఇలా మోసం చేయటం ధర్మమా? ఎంతో ఆశపడి వస్తారు. ఆ పని నావల్లకాదు" అన్నాడు.

పెళ్ళికూతుర్ల వివరాలు చెప్పి వాళ్ళ ఫోటోలు చూపితే వీడి మనసు మారదా అనుకుంది. కాని అలాంటి బూటకం ప్రకటన ఎవరు మాత్రం వేస్తారు?

★ ★ ★

ముల్లును ముల్లుతోనే తీయాలన్నది సామెత. దీర్ఘంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. ప్రకాశ్ ఇంటికి ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూడసాగింది.

"వచ్చావా, నానీ!"

"ఇది మరీ బాగుంది నానమ్మ! రాకుండా ఆఫీసులోనే కాపురం ఉండిపోతాననుకున్నావా?" అని హాస్యంగా అన్నా వెంటనే నాలిక్కరచుకున్నాడు. కాపురం అన్న మాట వచ్చినందుకు.

"కాపురం చెయ్యాలంటే ఎవరి మెడలోనైనా పుస్తెముడి కట్టాలి కదా! పోనీలే నువ్వు ఆఫీసుకి పుస్తెముడి కట్టి అక్కడే కాపురం వుండు. రేపటి నుండి ఈ నాయనమ్మ బెడద వుండదు."

నాయనమ్మ అలా ఎందుకందో అర్థంకాక విస్తుపోయాడు ప్రకాశ్.

"నేను కాశికి వెళ్తున్నాను. సుభద్రమ్మగారు కాశి వెళ్తున్నారు. వాళ్లు వారం రోజుల్లో తిరిగి వస్తారు. నేను మాత్రం నా శేషజీవితం ఆ విశ్వేశ్వరుడి సన్నిధిలోనే గడపాలని నిర్ణయించుకున్నాను" అంది శారదమ్మ.

"నా ఇల్లే నాకు కాశి, నా ఇల్లే నాకు రామేశ్వరం అనేదానివి. దేవుడి దర్శనానికి వెళ్తుంటేనే నా కొడుకు కోడలు దూరమయ్యారు. ఆ భగవంతుడి మీదనే నమ్మకం పోయింది అనేదానివి. ఉన్నపాటున

నీకీ ఆలోచన ఎలా కలిగింది? నీవు లేకుండా నేను ఉండగలనా? నాయనమ్మా వెళ్ళొద్దు, ప్లీజ్" అన్నాడు దుఃఖపూరిత అశ్రువులతో.

"నానీ! నువ్వేడిస్తే నాకు మనసు మార్చుకోవాలనిపిస్తుంది. ఏడవకు. నాకు అడుగడుగునా కష్టాలు ప్రసాదించాడని భగవంతుడి మీద నాకు కోపం వున్న మాట వాస్తవమే. అయితే ఆ భగవంతుడే నాకు జ్ఞానాన్ని ప్రసాదించాడు. నాకు బ్రతుకుదెరువు చూపించాడు. మిమ్మల్ని పెంచి పెద్ద చేయగల మొండిధైర్యం ఇచ్చాడు. నువ్వు బ్రహ్మచారి జీవితం కొనసాగిస్తానంటే నేను భరించలేను. నా నిర్ణయానికి తిరుగులేదు" అంది దృఢంగా.

"అంటే నువ్వు ఈ దారి ఎన్నుకున్నావా?"

"నా దారి నేను చూసుకుంటున్నాను."

"నాయనమ్మ! చిన్నతనంలోనే తల్లిని తండ్రిని పోగొట్టుకున్న నన్ను పెంచిపెద్ద చేశావు. ఈ వార్ధక్యదశలో నిన్ను ఒంటరిని చేయను. నీ గెలుపే నా గెలుపు. నీ మాట కాదనను. నేను పెళ్లి చేసుకుంటాను. ఇప్పుడు నీ నిర్ణయం మార్చుకుంటావా?"

శారదమ్మ మనుమడిని కౌగిలించుకుంది. "నాకు తెలుసురా నీ మనసు నవనీతం" అంది.

"ఇంతకాలం నీ మనసు నొప్పించాను. అందుకు బాధపడుతున్నాను."

"నానీ! మరోమాట. నేను ఎంపిక చేసిన పిల్లను నువ్వు కాదనకూడదు."

"నాయనమ్మా! నా బాగోగులు నీకంటె ఎవరు ఎక్కువగా చూస్తారు, సరే నీ ఇష్టం."

"నానీ! నేనిప్పుడే వస్తాను" శారదమ్మ బయలుదేరింది.

★ ★ ★

మనుమడు అంత తొందరగా మారుతాడని ఆమె ఊహించలేదు. ఒక సమస్య పరిష్కారమైంది. రెండవ సమస్య మరింత జటిలమైంది.

ఇందుమతి పునర్వివాహానికి ఒప్పుకుంటుందా? శారదమ్మకు ధైర్యం వుంది, నమ్మకం వుంది. ఇందుమతి నొసట కుంకుమ బొట్టు తను చూస్తుంది. ఇందుమతి కొడుకు తండ్రి లేని వాడుకాదు. ప్రకాశ్ ఇందుమతి చిలకాగోరింకల్లా తన కళ్లముందు కాపురం చేస్తారు.

ఇందుమతిని శాశ్వతంగా తన ఇంటికి ఆహ్వానించడానికి శారదమ్మ ఆ పిల్ల ఇంటికి వెళ్ళింది.

**(జాగృతి - దీపావళి ప్రత్యేక సంచిక 2005)**